క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి ప్రారంభించారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు పోషకాహారంపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎదిగే వయసులో పోషకాహారం లోపిస్తే వచ్చే అనార్థాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు సరిత, పంచాయతీ కార్యదర్శులు రాణి, గీత, అంగన్‌వాడీలు సుజాత, ప్రేమలత, సువర్ణ, నారాయణమ్మ, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశాలు నవనీత తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థాయి



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తదితరులు

షాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు గురుకుల విద్యాసంస్థలకు ఎంపిక కావడంతో సన్మాన కార్యక్రమాన్ని హెచ్ఎం సింహాద్రినాయుడుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ పాండు, కాంప్లెక్స్ జీహెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సరిత, నాయకులు నర్సింహులు, కుమార్, హరీష్, శ్రీకాంత్, రవి, మహేందర్, ఉపాధ్యాయులు హేమసుందర్ రావు, సరిత, అంగన్‌వాడీ వినోద, తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలకు కృషి



ఆరోగ్య పరికరాలు అందజేస్తున్న వెల్‌స్పన్ సంస్థ ప్రతినిధులు

షాబాద్: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ సంస్థ ఎంతో కృషి చేస్తోందని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ కె.సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చందనవెల్లి సీఎస్ఆర్ బృందం అవసరమైన వైద్య ఆరోగ్య పరికరాలు బీపీ మానిటర్, థర్మామీటర్లు, బయో మెడికల్ వ్యర్థాల కోసం బిన్స్, గ్లూకోమీటర్ తదితర వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పటిష్టానికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ హెడ్ సుబ్రహ్మణ్యంగుప్తా, డాక్టర్ ప్రభాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్దార్‌నగర్‌లో బిహార్ సర్పంచ్‌ల బృందం



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బిహార్ సర్పంచ్‌ల బృందం సభ్యులు

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని బిహార్ సర్పంచ్‌ల బృందం, ఎన్ఐఆర్‌డీ అధికారులు విద్యుల్లత, సైదిరెడ్డిలు గురువారం సందర్శించారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, వన మహోత్సవం నర్సరీ, కంపోస్టుయార్డు తదితర వాటిని పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద వచ్చిన నిధులతో చేపట్టిన పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం ఎంతో బాగుందని వారు తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టుయార్డుకు తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నట్లు పంచాయతీ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి విజయసింహ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు రాక.. వెతలు తీరక

- మూడు నెలలుగా కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అందని వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న శ్రమజీవులు
- భారంగా మారిన కుటుంబ పోషణ



బొబ్బిలిగామలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

షాబాద్: మూడు నెలలుగా కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్రియాశీలక పాత్ర వహిస్తున్న కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు వేతనాల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారు. పనుల ఎంపిక, కూలీలు హాజరయ్యేలా వారిలో చైతన్యం తీసుకురావడం, రిజిస్టర్లలో వివరాల నమోదు వంటి పనులు చేపడుతున్నారు. పథకంలో పక్కాగా నిర్వహించేందుకు ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్)ను గత ఆర్థిక సంవత్సరం ప్రారంభించింది.

కేటగిరీలుగా విభజించి

ఫీల్డ్ అసిస్టెంట్లు పనులకు వచ్చిన కూలీల పేర్లు నమోదు చేసుకొని, వారి ఫొటో తీసి యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. పని పూర్తయిన తర్వాత మరో దఫా చిత్రం తీసి అందులో పొందుపర్చే బాధ్యతలు వారికి అప్పగించారు. ఇలాంటి వాటిని చేపడుతున్నా సకాలంలో జీతాలు రాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పని దినాలు కల్పించిన వారిని కేటగిరీలుగా విభజించారు. అత్యధిక కేటగిరీ వారికి నెలకు రూ.12,200, రెండో దశ ఎఫ్ఏలకు రూ.9వేలు, మూడో కేటగిరీ చెందిన ఎఫ్ఏలకు రూ.7,700 వేతనంగా నిర్ణయించారు.

21 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు

మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో 21 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తుండగా, మిగిలిన ప్రాంతాల్లో సీనియర్ మేట్లు విధులు నిర్వహిస్తున్నారు. వారికి జనవరి, ఫిబ్రవరి, మార్చి(నెలల) వేతనాలు అందాల్సి ఉంది. ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్య విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయాలని మండలంలోని ఎఫ్ఏలు కోరుతున్నారు. మరోవైపు 4,900 మంది కూలీలుండగా అందులో 1,100 పనులు చేస్తున్నారు. వీరికి సైతం వేతనాలు అందలేదు.

వేతనాలు చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే విడుదల చేసి సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలి. రెగ్యులర్‌గా జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారి, అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్‌గా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

–అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, బొబ్బిలిగామ

ఉన్నతాధికారులకు నివేదించాం



గ్రామాల్లో ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. ఉపాధిహామీ సిబ్బందిలో టెక్నికల్ అసిస్టెంట్లకు మినహా మిగతా వారికి సంబంధించిన వేతనాలు మూడు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించాం.

– వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట: ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఉచితంగా ఇసుకను అందించేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఓఆర్ఆర్ సమీపంలో ఇసుక డంపును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులకు అందిస్తామని చెప్పారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్లతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంతో రైతులకు క్షేత్రస్థాయిలోనే న్యాయం జరుగుతుందన్నారు. తహసీల్దార్ పరిధిలో అక్రమాలు జరిగితే ఆర్డీఓ పరిధిలో.. అక్కడ పరిష్కారం కాకుంటే కలెక్టర్ స్థాయిలో.. అక్కడ కాకుంటే రెవెన్యూ కోర్టుల్లో సమస్య పరిష్కారం జరుగుతుందని తెలిపారు. భూభారతి చట్టంలో ఏమైనా లోపాలుంటే తెలియజేయాలని వాటిని సరిచేసుకొని ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. .

దేవాదాయ భూమి కాదు

మండల కేంద్రంలోని 777, 781, 783, 784 సర్వే నంబర్లలో సుమారుగా 50 ఎకరాల భూమి పట్టాదారులకు వంశపారపార్యంగా పట్టా మార్పిడి జరుగుతూ వస్తుందని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. గతంలో కొందరు ధరణిలో ఉన్న లోసుగులతో పట్టాభూములను దేవాదాయ భూములుగా మార్చినట్టు ఆరోపించారు. దేవాదాయ శాఖలో ఎక్కడా ఈ సర్వే నంబర్లు లేవన్నారు. ఈ సర్వేనంబర్లలో ప్లాట్ల కొనుగోలుదారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ జెడ్పీటీసీ విశాల శ్రావణ్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాణి, మనోహర్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు.. దుర్గంధం పరుగు



హిమాయత్‌నగర్‌లో చెత్తతో పేరుకుపోయిన మురుగు కాలువ



సాయిబాబా దేవాలయం పక్కన ఇలా..

మొయినాబాద్‌రూరల్: మురుగు కాలువ ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్, చెత్తతో పేరుకుపోవడంతో కంపుకొడుతుంది. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయ సమీపంలో రోడ్డు ఇరువైపులా మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో చిలుకూరు బాలాజీకి వెళ్లే యాత్రికులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. రోడ్డు పక్కన వాహనాన్ని కాసేపు ఆపి సేదతీరే పరిస్థితి లేకుండాపోయింది. అధికారులు స్పందించి మురుగు కాలువను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



షాద్‌నగర్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు



కేశంపేట: పోషకాహారం గురించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

షాద్‌నగర్: మహిళలు తప్పని సరిగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అండాలు మాట్లాడుతూ.. చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారదమ్మ, రోజ, రంగమ్మ, ఆశ కార్యకర్త లలిత, ఆయాలు సంతోష, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల అందజేత

కేశంపేట: పోషకాహారం తీసుకుంటేనే గర్భిణులు, బాలింతలు మరింత ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సిబ్బంది సూచించారు. మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గురువారం పోషన్‌పక్వాడ, గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. అనంతరం ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంతోష, ఆశాలు స్వప్న, భారతి, లక్ష్మి, సుమతి, జిమ్స్ ఆస్పత్రి వైద్యులు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

మంచాల: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం మంచాల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆగాపల్లిలో రూ.4 కోట్లతో ఆగాపల్లి– నోముల బీటీ రోడ్డు, ఆగాపల్లిలో రూ.11లక్షలతో మైనార్టీ కమ్యూనిటీ హాల్, మరో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు, కాగజ్‌ఘట్ గ్రామంలో రూ.6 లక్షలతో శ్మశాన వాటికకు ప్రహరి నిర్మాణం, మరో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు, జాపాలలో రూ.20 లక్షలతో అండర్ డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణం పనులు, అస్మత్‌పూర్‌లో రూ.10 లక్షలతో అండర్ డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణం పనులు, రూ.5 లక్షలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు భూభారతిపై అవగాహన సదస్సు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన భూభారతి పోర్టల్‌పై ఈ నెల 19న ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

చేవెళ్లలో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

చేవెళ్ల: స్థానికంగా భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఈదురుగాలులతో కూడిన వాన కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేవెళ్ల మున్సిపాలిటీతోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు, దుకాణాదారులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పశువులకు గాలికుంటు టీకాలు



మొయినాబాద్: సురంగల్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు



శంకర్‌పల్లి: ఇరుకుంట తండాలో టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రావణి

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీలోని సురంగల్‌లో గురువారం గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 192 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీకాలు కార్యక్రమంలో గ్రామాల వారీగా గురువారం నుంచి మే 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని పాడిరైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల పాటు..

శంకర్‌పల్లి: మండలంలో నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు శంకర్‌పల్లి పశు వైద్యాధికారి మానసరెడ్డి, మహారాజ్‌పేట్ పశు వైద్యాధికారి శ్రావణి తెలిపారు. గురువారం మండలంలోని చిన్న శంకర్‌పల్లి, ఇరుకుంట తండాలో వ్యాధి నివారణ టీకాలు ప్రారంభించారు. పశు వైద్యాధికారులు మాట్లాడుతూ.. వచ్చే నెల 14వరకు మండలంలో ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని చెప్పారు. ఇందుకు 4 బృందాలు ఏర్పాటు చేసుకున్నట్లు స్పష్టం చేశారు.

గర్భకోశ వ్యాధులకు చెక్

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మాచన్‌పల్లి, కుమ్మరిగూడ, రేగడిదోస్వాడ గ్రామాలల్లో పశువులకు గాలి టీకాలు వేశారు. గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే టీకాలు తప్పకుండా వేయించాలన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్: దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్: అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని దేవునిపల్లిలో దెబ్బతిన్న పంటలను స్థానిక నేతలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అకాలంగా కురిసిన భారీ వర్షానికి దెబ్బతిందన్నారు. పంటలు, తోటల సాగు కోసం రైతులు, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారన్నారు. పంట చేతికి రాకపోగా అప్పులు మిగిలిపోయాయని అన్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి 32 ఎకరాలు మామిడి తోట, పసుల జంగయ్యకు చెందిన 4 ఎకరాల బొప్పాయి తోట పూర్తి దెబ్బతిన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర సర్కారు అమలుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గణేష్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, భాను, నరేందర్‌రెడ్డి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గావ్‌చలో–బస్తీచలో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా అందుతున్న సన్నబియ్యం పంపిణీలో కేంద్రం వాటా ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణతో పాటు పలు పథకాలకు కేంద్రం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇలాంటి విషయాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలే ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహాగౌడ్, ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌చారి, హరికృష్ణ, నరేందర్‌రెడ్డి, నర్సింహ, మోహన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మూనావత్ రాజునాయక్ ఏర్పాటు చేసిన ఆటో ఫైనాన్స్ కార్యాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు లక్పతినాయక్, బీక్యానాయక్, రాముసాయక్, యాదగిరిరెడ్డి, రాజునాయక్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు



సమావేశంలో మాట్లాడుతున్న హిమబిందు

షాద్‌నగర్: ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలను పొందవచ్చని డివిజన్ హార్టికల్చర్ అధికారి హిమబిందు పేర్కొన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండల పరిధిలో దాదాపు 252 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు అవుతుందన్నారు. దీని నిర్వాహణకు డబ్బులు నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేసిన రైతులకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ అందజేస్తారన్నారు. ఎరువులకు ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేళ్లకు రూ.16800లను ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందన్నారు. ఎకరాలకు 8 నుంచి 10 టన్నులపైనే గెలల దిగుబడి వస్తుందని, ఒక టన్ను రూ.21వేలు ఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, కంపెనీ వారే పొలం దగ్గరకువచ్చి కొనుగోలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆయిల్ వాల్యూ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు, ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరండి



చేవెళ్ల: వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల: బీఆర్ఎస్ పార్టీ ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.క్రిష్ణారెడ్డి, నియోజకవర్గ నాయకుడు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ కోరారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సభకు తరలి రావాలని కోరారు. రాబోయే రోజుల్లో గులాబీ పార్టీ అలంబించాల్సిన విధానాలను సూచిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, నరహరిరెడ్డి, నర్సింలు, రాంప్రసాద్, చంద్రశేఖర్, సుదర్శన్, మానిక్యరెడ్డి, మాదవ్‌రెడ్డి, మజర్, క్రిష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ 25ఏళ్ల రజతోత్సవ వేడుకలని విజయవంతం చేయాలని పార్టీ శంకర్‌పల్లి అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం శంకర్‌పల్లిలో ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో రజతోత్సవ వేడుకకి సంబంధించి ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, గోడ పత్రికను ఆవిష్కరించారు. మండలాధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటులో టీఆర్ఎస్ ఎంతో కీలకంగా వ్యవహరించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారాయణ, నాయకులు రాజునాయక్, మాణిక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.